క్లుప్తంగా

సర్వే పక్కాగా నిర్వహించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న అకడమిక్ మానిటరింగ్ అధికారి రాజశేఖర్

ములకలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ సర్వేలో ఎటువంటి లోటుపాట్లకు తావివ్వకుండా పక్కాగా నిర్వహించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజు సూచించారు. మండలపరిధిలోని ములకలపల్లి, చౌటిగూడెం కాలనీ పాఠశాలల్లో చేపడుతున్న సర్వేను సోమవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, వారి సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సర్వే తీరుపట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.

విద్యారంగ సమస్యలపై వినతి

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. మండలంలోని రంగాపురంలో పర్యటించిన ఎమ్మెల్యేను విద్యార్థిసంఘం నాయకులు కలిసి పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.రాంచరణ్, నాయకులు వి.అఖిల్, పి.పవన్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల వితరణ



పరీక్ష ప్యాడ్లను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దమ్మపేట: మండల పరిధిలోని నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, పూర్వపు విద్యార్థులు పరీక్ష ప్యాడ్లు, జామెంట్రీ బాక్స్‌లను సోమవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా నాగుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 2010–11వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, ప్రస్తుతం పది చదువుతున్న మొత్తం 24 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు అఖిల్, చెన్నారావు, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నించాలి

చర్ల: భద్రాచలంలో ప్రభుత్వ న్యాయ కళాశాలను ఏర్పాటు కోసం గిరిజన ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ కోరారు. చర్లలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ న్యాయ కళాశాల ఏర్పాటుతో గిరిజనులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎక్కువ మంది న్యాయ విద్య చదువుకుని, గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలను ఎత్తి చూపే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు పూనెం వరప్రసాద్, సాయం సన్యాసిరావు, ఇర్పా అరుణ్‌కుమార్, నూపా సరోజిని, కనితి ఉషారాణి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందిస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిధిలోని చింతాలక్ష్మీనగర్ గిరిజన గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని పీఓడబ్ల్యూ నాయకులు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం ప్రజాదర్బార్‌లో ఐటీడీఏ పీఓను కలిసిన పీఓడబ్ల్యూ నాయకులు చింతాలక్ష్మీనగర్ గ్రామంలోని సమస్యలను వివరించారు. అదే విధంగా గోదావరి వరద ముంపు బాధితులకు కృష్ణసాగర్ గ్రామం వద్ద సీతారామ కెనాల్ పక్కన ఉన్న భూమిని ఇళ్ల నిర్మాణాలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకులు సున్నం భూలక్ష్మి, కృపారాణి, బండ్ల కమలమ్మ, సోడే అచ్చమ్మ, ఎస్డీ నాసర్‌పాషా తదితరులున్నారు.

యాసంగి పంటలను కాపాడుతాం..

- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- దోమలవాగు ఆయకట్టుకు సీతారామ జలాలు విడుదల



బూర్గంపాడు: గోదావరి జలాల పంపింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: యాసంగి పంటలు ఎండిపోకుండా కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. నకిరిపేట వద్ద సీతారామ కాల్వ నుంచి దోమలవాగు చెరువుకు గోదావరి జలాల పంపింగ్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దోమలవాగు ఆయకట్టు కింద 600 ఎకరాల్లో సాగుచేసిన పంటలకు నీరు అందడం లేదని రైతులు చెప్పగా, సీతారామ కెనాల్ నుంచి మోటార్లతో గోదావరి జలాలను చెరువులోకి విడుదల చేస్తున్నామన్నారు. బూర్గంపాడు, అశ్వాపురం మండలాలకు సీతారామ ప్రాజెక్టు కెనాళ్లతో సాగునీరు అందిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాయంను రైతులు సన్మానించారు. ఇరిగేషన్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు చేయడంపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మణుగూరులోని క్యాంపు కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేయగా నాయకులు పీరినాకి నవీన్, తరుణ్‌రెడ్డి, శివ, సౌజన్య, కూచిపూడి బాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పైప్‌లైన్ మరమ్మతులు, డొంక రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించడంతో పాటు ఉపాధి హామీ పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

కరకగూడెం/పినపాక: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. కరకగూడెం మండలం రేగళ్ల, మద్దెలగూడెం, పినపాక మండలం భూపాలపట్నంలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పాలన అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా నిలుస్తూ పారదర్శకత, జవాబుదారీతనంతో పాలన అందిస్తోందని తెలిపారు. కాగా, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక శాతం నిధులు కేటాయించేలా చూడాలని కరకగూడెం మండల పర్యటనలో ఎమ్మెల్యేకు ఎస్ఎఫ్ఐ నాయకుడు మాదాసు అఖిల్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు నాగ ప్రసాద్, అద్దంకి నరేష్, ఎంపీడీఓలు కుమార్, సునీల్‌కుమార్, ఎంపీఓ కె.వెంకటేశ్వరరావు, నాయకులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, ఎర్ర సురేష్, రామనాథం పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు 45 రోజుల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధికారులకు సూచించారు. మండలంలోని ఊటుపల్లి పంచాయితీ రంగాపురం గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సోమవారం ఆయన భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే దత్తత గ్రామమైన రంగాపురంలో ఇళ్ల నిర్మాణాలు ఆదర్శంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, నాయకులు వనమా గాంధీ, వేముల రమణ, పోట్రు వెంకటేశ్వరరావు, కట్టా శివ, సుభాని, సత్యం, ప్రసాద్ పాల్గొన్నారు.

మెరుగైన నష్టపరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ, ప్రభుత్వం మణుగూరు ఓసీ విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు మెరుగైన నష్టపరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని మణుగూరు, తిరుమలాపురం(విజయనగరం), రామానుజవరం రెవిన్యూ పరిధిలో గిరిజన, గిరిజనేతర రైతులు ఏటా రెండు పంటలు పండే వ్యవసాయ సాగుభూములను మణుగూరు ఓసీ విస్తరణలో కోల్పోనున్నారన్నారు. తమ జీవనాధారమైన భూములను కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఎకరానికి రూ.40లక్షల నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎంజైమెంట్ సర్వేలో ఉన్న వారికి సైతం నష్టపరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అక్కి నర్సింహారావు, ఆవుల నర్సింహారావు, వేర్పుల సురేష్, పద్దం శ్రీనివాస్, గుర్రం సృజన్ పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే సేవలు అనిర్వచనీయం



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

చర్ల: భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలే దేశానికి చేసిన సేవలు అనిర్వచనీయమని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్ అన్నారు. సావిత్రీ బాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని చర్లలో పార్టీ మండల అధ్యక్షుడు కొండా కౌశిక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు విద్యను అందించేందుకు సావిత్రీబాయి పూలే చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్, ప్రధాన కార్యదర్శి సామల ప్రవీణ్, కార్యదర్శి చల్లగుళ్ల సతీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వావలంబన సాధించాలి

చంద్రుగొండ: నేటి సమాజంలో మహిళలు స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న అన్నారు. మండలకేంద్రం చంద్రుగొండలో ప్రతిభ విద్యాలయంలో సజ్జన సమాజం ఆధ్వర్యంలో సోమవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న ఘటనలు సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మంచి చెడులను పిల్లలకు చిన్ననాటి నుంచే వివరించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య, ఆశావర్కర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ కనకం తనుజ, పాఠశాల కరాస్పాండెంట్ యండి.ఖాజాహుసేన్, ప్రిన్స్‌పాల్ పర్వీన్, నాయకులు సారేపల్లి శేఖర్, కీసరి కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మహిళలు అన్ని రంగంలో రాణించే విధంగా మరింత శక్తివంతులుగా ఉండాలని ఎంఈఓ పి.ప్రసాద్‌రావు కోరారు. సోమవారం అశ్వారావుపేటలోని జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా స్థానిక మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత, పలువురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్, వెంకటేశ్వరరావు, మడకం కృష్ణారావు, కొండలరావు, నాగలక్ష్మి, తిరుపతమ్మ, రాజేశ్వరి, విజయలక్ష్మి, రజిని, లక్ష్మి, హరిత పాల్గొన్నారు.

పంటపొలాలకు నీరు అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ములకలపల్లి: సాగు నీరులేక ఎండిపోతున్న పంటచేలకు సీతారామ ప్రాజెక్ట్ గోదావరి జలాలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంతోపాటు మాధారం, సత్యంపేట, గొల్లగూడెం గ్రామాల్లో వాగు నీటి ద్వారా పంటలను సాగు చేస్తున్నారని అన్నారు. ఇటీవల ఎండల ధాటికి వాగులు పట్టిపోతున్నాయని, దీంతో పంటచేలకు సారు నీరు అందే పరిస్థితి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. 'సీతారామ' నీటికి వాగుల్లోని మళ్లించడం ద్వారా ఆయా భూములకు సాగు జలాలు అందించాలని అన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, వర్సా శ్రీరాములు, రైతులు వనమా సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, వీరభోజాచారి, సతీశ్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలి

ములకలపల్లి: ఈఆర్ఎస్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు 13వ తేదీన (గురువారం) స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని ఐసీడీఎస్ సీడీపీఓ హేమసత్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో హాజరు కావాలని తెలిపారు.

రేపటి నుంచి తిరునాళ్ల ఉత్సవాలు

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం గ్రామంలో గుట్టపై ఉన్న శ్రీజగదాంబ సమేత జయలింగేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవ వేడుకలు రేపటి(బుధవారం) నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు ఎర్రగొర్ల రాధాకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 వరకు కొనసాగనున్న ఈ వేడుకల సందర్భంగా పలు రకాల పూజలు, రాత్రి సమయాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని జానకీపురం గ్రామంలో ఉన్న సత్తెమ్మతల్లి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆలయాన్ని సందర్శించి అమ్మవారి సన్నిధిలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫోన్ అందజేసిన పారిశుద్ధ్య కార్మికుడు

అశ్వాపురం: మండలంలోని మొండికుంటలోని రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరైన వ్యక్తి ఫోన్ పోగొట్టుకోగా.. అది దొరికిన పారిశుద్ధ్య కార్మికులు తిరిగి అప్పగించారు. గ్రామంలోని కొల్లు చినమల్లారెడ్డి ఇంటికి వచ్చిన బంధువులు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. ఇది యాగశాల వద్ద పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు గుండి సమ్మయ్యకు దొరకడంతో సోమవారం మల్లారెడ్డికి అందించగా కృతజ్ఞతలు తెలిపారు.

కొండరెడ్లకు ఇళ్లు ఇవ్వాలి

భద్రాచలంటౌన్: జిల్లాలోని ఆదివాసీ కొండరెడ్లకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కొండరెడ్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి పీఓ బి.రాహుల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు ముర్ల రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో యాట్ల మహేష్ రెడ్డి, ఉమ్మలా బాబురెడ్డి, చిప్పల వెంకన్న బాబురెడ్డి, యాట్ల రమేష్ రెడ్డి, బొల్లు సీతమ్మ, చిప్పల యశోద, శ్రీనివాస రెడ్డి, సోమిరెడ్డి, ప్రసాద రెడ్డి, రాములమ్మ, చెల్లమ్మ, వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిక

చర్ల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సోమవారం బీఎస్పీలో చేరారు. మండల కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గండూరి శ్రీను, అమరవాది యశోధారెడ్డి, బోడా ప్రశాంత్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ.. బహుజనులంతా ఐక్యమై రాజ్యాధికారం సాధించే దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్, ప్రధాన కార్యదర్శి సామాల ప్రవీణ్, కార్యదర్శి చల్లగుళ్ల సతీష్ చౌదరి, పార్టీ మండల అధ్యక్షులు కొండా కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వైకుంఠధామం



వాగులో స్నానాలు చేస్తున్న స్థానికులు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో గతంలో ఉపాధి హామీ కింద రూ.10 లక్షలతో నిర్మించిన వైకుంఠధామం సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారింది. ఇందులో బోరు ఉన్నా విద్యుత్, నల్లా సౌకర్యం లేదు. దీంతో గ్రామంలో ఎవరు చనిపోయినా వైకుంఠదామానికి వచ్చే ప్రజలు సమీపంలోని వాగులో స్నానాలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించకుండా కాంట్రాక్టర్ల కోసమే వైకుంఠ ధామం నిర్మించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి వైకుంఠధామంలో విద్యుత్, నల్లా సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేగులగండిలో మలేరియా సర్వే



రక్తనమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరురూరల్: మండల పరిధిలోని కూనవరం గ్రామపంచాయతీ రేగులగండి గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా మలేరియా సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి జ్వరపీడితుల వివరాలను సమీకరించి అనుమానితుల నుంచి రక్తనమూనాలను సేకరించారు.

అనంతరం అవసరమైన వారికి మందులను పంపిణీ చేసి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎస్ అరుణ్‌బాబు, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, ఏవీ లక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలి



సూపరింటెండెంట్ రామకృష్ణతో ఆస్పత్రి సమస్యలపై చర్చిస్తున్న బాబురావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబురావు కోరారు. సోమవారం మిడియం బాబురావు ఆధ్వర్యంలో సీపీఎం బృందం భద్రాచలం ఏరియా ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి సమస్యలపై సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణతో చర్చించారు. ఈ సందర్భంగా మిడియం బాబురావు మాట్లాడుతూ.. నాలుగు రాష్ట్రాల ప్రజలకు కేంద్ర బిందువుగా ఉన్న భద్రాచలం ఏరియా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి సరైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సారెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు శరత్‌బాబు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వైవీ రామారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కుర్చీల వితరణ



కుర్చీలతో చిన్నారులు, గ్రామపెద్దలు

ములకలపల్లి: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు తిమ్మంపేట గ్రామనివాసి తాండ్ర సురేఖ కుర్చీలను వితరణగా అందజేశారు. తిమ్మంపేట, తిమ్మంపేట కాలనీకి చెందిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని 26మంది చిన్నారులకు కుర్చీలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయులు నిర్మల, సురేశ్, ప్రశాంత్, ముక్తేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్లు రమణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కాల్వకు దారి చూపరూ..

మణుగూరుటౌన్: మండలంలోని వాసవీ నగర్ ప్రాంతం మీదుగా వెళ్తున్న మురుగు కాల్వను కొందరు అడ్డుకున్నారని, దీనిని పరిష్కరించాలని ప్రజావాణిలో సోమవారం స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అశోక్ నగర్ ప్రధాన రహదారి, సమితిసింగారం ప్రాంతాలకు చెందిన వృథాజలం, వరద నీరు, మురుగునీరు ఈ కాల్వ ద్వారానే వాసవీనగర్ మీదుగా కుంటలో కలుస్తాయని, కాని కొందరు కాల్వకు అడ్డంగా మట్టి తోలకాలతో కాల్వను మూసివేశారని వివరించారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజావాణిలో విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. భూములపై సర్వే చేయిస్తామని, పారే కాల్వలు మూసివేస్తే ఊరుకుబోమని ఈ సందర్భంగా అధికారులు బదులిచ్చినట్లు వారు తెలిపారు. చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. కత్తిరాము, చిట్టూరు శేషుకుమార్, శ్రీనివాసరావు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ఎన్ఆర్ఐకు సన్మానం



సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం నిర్మాణానికి రూ.25 లక్షలు విరాళం అందజేసి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను విజయవంతం చేసిన ఎన్ఆర్ఐ కందిమళ్ల సత్యనారాయణరెడ్డిని సోమవారం ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గతంలో ఊరి అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి.. గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమమైన ముందుంటున్న ఎన్ఆర్ఐని గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మర్రి మల్లారెడ్డి, తిప్పరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, జాలె రామకృష్ణారెడ్డి, కాసర బాద శ్రీనివాస్, సుంచు వీరాలు, మేడవరపు సుధీర్, పాటి మన్మథరెడ్డి, పాటి వెంకటరెడ్డి, పగిడిపల్లి జంపయ్య, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోవును కాపాడిన కాంగ్రెస్ నాయకులు



తాళ్లసాయంతో గోవును బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు

మణుగూరుటౌన్: మండలంలోని సమితిసింగారం పంచాయతీ కోర్టు వెనుక ప్రాంతం వీధిలో పాడుబడ్డ బావిలో ప్రమాదవశాత్తూ ఆవు పడిపోయింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కాంగ్రెస్ నాయకులు వెంటనే అక్కడకు చేరుకుని తహసీల్దార్ రాఘవరెడ్డి, ఫైర్ విభాగం సహకారంతో ఆవును తాళ్ల సాయంతో బయటకు తీసి కాపాడారు. ఈ సందర్భంగా స్థానికులు కాంగ్రెస్ నాయకులు గాండ్ల సురేశ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, గుడిపూడి కోటేశ్వరరావు, చైతన్య తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాదరావు

చర్ల: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కపై చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీ తాతా మధు వెనక్కి తీసుకోవాలని టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాదరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. దళిత సామాజిక వర్గానికి చెందిన భట్టిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ ఇర్పా శ్రీను, నాయకులు కె.విజయకుమార్‌నాయుడు, కాకర్ల బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వ్యాఖ్యలు సరికాదు

దుమ్ముగూడెం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ది ప్రవీణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. దళిత నేత అయిన డిప్యూటీ సీఎంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు గంట్ల ప్రశాంతి, దాసమల్ల ప్రేమ్‌కుమార్, మద్దికుమారి, వాసం రాంకుమార్, గంట్ల రాజు, జెట్టి వినీల్, కొన్ని రోహిత్, ధన్నూరి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.